www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 10 నవంబర్ 2024

5


పశ్చిమ గోదావరి



ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని వినతి

నరసాపురం : నరసాపురంలో త్వరలో ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయించేందుకు ప్రయత్నిస్తానని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు హామీ ఇచ్చారు. శనివారం స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని బోట్‌మెన్ సొసైటీ, ట్రాక్టర్ల యాజమానుల సంఘం ఆర్‌డిఒకు విన్నవించారు. దశాబ్దాలుగా పట్టణంలోని బాలుల వద్ద ఉండేదన్నారు. దీని ఆధారంగా వందలాది మంది మత్స్యకారులు జీవనం సాగించేవారు. గోదావరిలోంచి పడవలపై ఇసుక తీసుకొచ్చి లారుల వద్ద స్టాక్ పాయింట్‌కు ప్రజల అవసరాలకు ఇచ్చే వారన్నారు. ప్రభుత్వం పాట ద్వారా ప్రజలకు ఇసుక ఇచ్చేదన్నారు. ఈ స్టాక్ పాయింట్ తెరవకపోవడం వల్ల దీన్ని నమ్ముకుని బోటు సాగిస్తున్న వందలాది కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఆర్‌డిఒ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. త్వరలో పాయింట్ అనుమతించి తీరంలో ఇసుక కొరత లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పులూరి శంకర్, మల్లాడి సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

బాబు.. పద్దు పలికేనా..!



- పోలవరం నిర్వాసితులకు నిధులు కేటాయించేనా
- చింతలపూడి, తాడిపూడికి నిధులిస్తారా
- ఐదేళ్లుగా పడకేసిన డెల్టా ఆధునికీకరణకు కేటాయింపులుండేనా
- ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహకాలు దక్కేనా
- కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణానికి నిధులిచ్చేనా
- రేపు అసెంబ్లీలో పూర్తిస్థాయి బడ్జెట్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి సర్కార్ సోమవారం అసెంబ్లీలో ప్రవేశ పెడుతున్న తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌లో జిల్లాకు నిధుల కేటాయింపుపై జనాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. గడిచిన ఎన్నికల్లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని అన్ని స్థానాలను టిడిపి కూటమి కైవసం చేసుకుంది. ఎన్నికల ప్రచారాల్లో ఉమ్మడి పశ్చిమను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తామని కూటమి నేతలు హామీలిచ్చారు. జిల్లాలో చింతలపూడి, తాడిపూడి వంటి సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండిపోయాయి. పోలవరం నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఐదేళ్లుగా డెల్టా ఆధునికీకరణ పనులు ముందుకు సాగని పరిస్థితి ఉంది. కొల్లేరు రెగ్యులేటర్ నిర్మాణం, నరసాపురం ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్ మాటలకే పరిమితమయ్యాయి. ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహకాలు లేకుండాపోయాయి. బడ్జెట్‌లో నిధులు కేటాయింపుతో జిల్లా అభివృద్ధికి కూటమి సర్కార్ అండగా నిలబడుతుందో, లేదో చూడాల్సి ఉంది.

గడిచిన ఎన్నికల్లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలను టిడిపి కూటమికి జనం కట్టబెట్టారు. దీంతో ఆక జిల్లా అభివృద్ధి పరుగులు తీస్తుందని జనం ఆశలు పెట్టుకున్నారు. పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టనుండటంతో జిల్లాలోని ప్రధాన సమస్యలకు సంబంధించిన నిధులను కేటాయిస్తుందని జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా కూటమి సర్కార్ ఇచ్చిన హామీల్లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడం. అందుకు సంబంధించిన ప్రక్రియ వేగంగా ముందుకు తీసుకెళ్తున్న పరిస్థితి. కేంద్రం నుంచి రూ.12 వేల కోట్లు వచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. పోలవరం ప్రాజెక్టులో ప్రధాన సమస్య నిర్వాసితులు. ఏలూరు జిల్లాలో 107 గ్రామాలకు సంబంధించి 21 వేల కుటుంబాలను తరలించాల్సి ఉంది. సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం ఇచ్చి తరలించిన తర్వాతే ప్రాజెక్టు పనులు ముందుకు సాగించాల్సి ఉంది. ప్రాజెక్టు నిర్మాణానికి అయ్యే ఖర్చులో అగ్రభాగం దాదాపు రూ.33 వేల కోట్లు నిర్వాసితులకే ఇవ్వాల్సి ఉంది. కేంద్రం ఇచ్చినట్లు చెబుతున్న నిధుల్లో నిర్వాసితులకు ఎంత కేటాయించారో బడ్జెట్‌లో చెబుతారో లేదో చూడాలి. గత వైసిపి ప్రభుత్వం నిర్వాసితులను తీవ్రంగా వంచించింది. పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలకు పెంచుతామని, 2006లో సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షలు ఇస్తామని, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఇస్తామని అనేక హామీలు ఇచ్చింది. ఐదేళ్ల పాలనలో ఏఒక్క హామీ నెరవేర్చలేదు. తాము అధికారంలోకి వస్తే పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తామని సిఎం చంద్రబాబుతోపాటు డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాన్ ఎన్నికల్లో హామీ ఇచ్చారు. జనసేన ఎమ్మెల్యేను అక్కడి ప్రజలు గెలిపించారు. బడ్జెట్‌లో పునరావాసానికి నిధులు ఎంతమేర కేటాయిస్తారో వేచిచూడాలి.

చింతలపూడి, తాడిపూడికి నిధులిచ్చేనా?

చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తయితే ఉమ్మడి పశ్చిమ, కృష్ణా జిల్లాలోని 4.60 లక్షల ఎకరాలకు, తాడిపూడి ప్రాజెక్టులో పిల్ల కాలువల తవ్వకాలు పూర్తి చేస్తే మరో 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. దశాబ్దాలు గడిచినా ఈ ప్రాజెక్టులు పూర్తికాని పరిస్థితి. రాష్ట్రంలో ఆరు సాగునీటి ప్రాజెక్టులను ప్రధానంగా తీసుకుంటున్నట్లు కూటమి సర్కార్ తెలిపింది. అందులో చింతలపూడి ప్రాజెక్టు ఉన్నట్లు చెప్పారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రెండు దశల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అందుకు రూ.3,782 కోట్లు అవసరమని జలవనరుల శాఖ అంచనా వేసింది. జల్లేరు జలాశయం పనులు రెండోదశలో చేపడతారు. 2026 జూన్‌కు తొలి దశ పనులు పూర్తి చేస్తామని ప్రభుత్వం తెలిపింది. బడ్జెట్‌లో దీనికి సంబంధించిన నిధులు కేటాయిస్తారా, లేదా అనేది చూడాల్సి ఉంది. తాడిపూడి ప్రాజెక్టు 2006లో ప్రారంభమైంది. ఇప్పటికీ పిల్ల కాలువలు పూర్తికాలేదు. మరో 200 కోట్లు కేటాయిస్తే పనులు చాలా వరకూ కొలిక్కి వచ్చే పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని తాడిపూడి ప్రాజెక్టు కింద సాగునీరు కోసం ఎదురుచూస్తున్న రైతులు కోరుతున్నారు.

ఫిషింగ్ హార్బర్, కొల్లేరు రెగ్యులేటర్ నిర్మాణానికి నిధులిస్తారా

నరసాపురం మండలం బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం, 2019-24 మధ్య వైసిపి ప్రభుత్వం చెప్పాయి. ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణంపై వైసిపి ప్రభుత్వం పెద్దఎత్తున హడావుడి చేసి పట్టించుకోలేదు. కూటమి సర్కార్ ఫిషింగ్ హార్బర్, రెగ్యులేటర్ల నిర్మాణంపై దృష్టి సారించి, నిధులు కేటాయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

పడకేసిన డెల్టా ఆధునికీకరణ

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఖరీఫ్, రబీలో దాదాపు పది లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. 11 ప్రధాన కాలువలు, 300కుపైగా ఉప కాలువల ద్వారా సాగునీరు సరఫరా జరుగుతోంది. 2007లో అప్పటి ప్రభుత్వం డెల్టా ఆధునికీక రణకు రూ.1,416 కోట్లు కేటాయిస్తూ ఆమోద ముద్ర వేసింది. దాదాపు రూ.800 కోట్లు వరకూ ఖర్చుపెట్టారు. ఇంకా రూ.600 కోట్లకుపైగా ఖర్చు చేయాల్సి ఉంది. పెరిగిన ధరలతో ఇప్పుడు రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తే తప్ప డెల్టా ఆధునికీకరణ పూర్తయ్యే పరిస్థితి లేదు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో డెల్టా ఆధునికీకరణకు ఒక పైసా విదల్చలేదు. దీంతో కాలువలు పూడుకుపోయాయి. ప్రతియేటా వర్షాలు, వరదలకు లక్షలాది ఎకరాల్లో పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బడ్జెట్‌లో ఆధునికీకరణకు నిధులు కేటాయిస్తే ఏప్రిల్‌లో కాల్వలు కట్టేసిన తర్వాత పనులు ప్రారంభించి ముందుకు సాగడానికి వీలుంటుంది. కూటమి సర్కార్ నిధులు కేటాయిస్తుందో, లేదో చూడాలి.

రైతులకు ప్రోత్సాహకాలు లభించేనా

జిల్లాలో అతిపెద్ద సాగుగా వరి, రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా, లక్షన్నర ఎకరాల్లో పామాయిల్ ఉన్నాయి. ఆక్వా రైతులకు మేత ధరలు పెరిగిపోవడం, రొయ్యకు సరైన ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. విద్యుత్ సబ్సిడీ సైతం అందరికీ అందించడం లేదు. వరి రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ఉపయోగపడేలా బడ్జెట్‌లో ఏమైనా ప్రోత్సాహకాలు ప్రకటించాలని రైతాంగం కోరుకుంటుంది. కూటమి సర్కార్ ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

నరసాపురానికి రెండు పదవులు

కేబినెట్ హోదాతో మైనార్టీ వ్యవహారాల సలహాదారునిగా షరీఫ్

కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా కొత్తపల్లి



ప్రజాశక్తి - నరసాపురం

కూటమి ప్రభుత్వం శనివారం రెండో విడత విడుదల చేసిన నామినేటెడ్ పదవుల జాబితాలో నరసాపురానికి రెండు పదవులు దక్కాయి. శాసన మండలి మాజీ ఛైర్మన్ ఎంఎ.షరీఫ్ కేబినెట్ హోదాతో మైనార్టీ వ్యవహారాల సలహాదారునిగా, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు లభించాయి. ఈ సమాచారం తెలియగానే పట్టణంలోని టిడిపి, జనసేన శ్రేణులు, ముస్లింలు సంబరాలు చేసుకున్నారు. పంజాసెంటర్‌లో మిఠాయిలు పంచిపెట్టారు. కొత్తపల్లి నివాసం వద్ద సందడి నెలకొంది. ఆయన స్థానికంగా లేకపోవడంతో ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.


మహ్మద్ అహ్మద్ షరీఫ్ టిడిపి ప్రారంభంలోనే పార్టీలో చేరారు. లా చదివిన ఆయన టిడిపి పట్టణాధ్యక్షుని బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి సిఎం ఎన్‌టిఆర్ షరీఫ్ పనివిధానం మెచ్చి హైదరాబాద్ రప్పించుకుని పార్టీ కార్యాలయ బాధ్యతలు అప్పగించారు. తర్వాత మైనార్టీ కార్పొరేషన్, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు సైతం నిర్వహించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా, క్రమశిక్షణా కమిటీ ఛైర్మన్ వంటి కీలక పదవులు నిర్వహించారు. రాష్ట్ర విభజన తరువాత ఎంఎల్‌సి పదవి చేపట్టి శాసనమండలి ఛైర్మన్ అయ్యారు. గత ఎన్నికల్లో రాయలసీమ ప్రాంతంలో షరీఫ్ ప్రచార బాధ్యతలు పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో ఆయనకు కేబినెట్ హోదాతో పదవి దక్కడంపై తెలుగుతమ్ముళ్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇక కొత్తపల్లి సుబ్బారాయుడు నరసాపురం నియోజకవర్గం నుంచి టిడిపి తరపున 1989, 1994, 1999, 2004లో ఎంఎల్‌ఎగా గెలుపొందారు. ఉమ్మడి రాష్ట్రంలో రాష్ట్ర గృహనిర్మాణ, విద్యుత్ శాఖా మంత్రిగా పని చేశారు. 1996-98 కాలంలో ఎంపీగా పని చేశారు. ఆ సమయంలో ఆయన సోదరుడు కొత్తపల్లి జానకీరామ్ ఎంఎల్‌ఎగా ఎన్నికయ్యారు. 2009లో ప్రజారాజ్యం తరపున నరసాపురం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2012 ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎంఎల్‌ఎగా ప్రసాదరాజుపై గెలుపొందారు. 2014లో వైసిపి తరపున టిడిపి అభ్యర్థి బండారు మాధవనాయుడు చేతిలో ఓడిపోయారు. అనంతరం టిడిపిలో చేరి 2019 ఎన్నికల ముందు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి చేపట్టారు. అనంతరం కాపు కార్పొరేషన్ పదవికి రాజీనామా చేసి వైసిపిలో చేరారు. 2019 ఎన్నికలకు పోటీకి దూరంగా ఉండి వైసిపి అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజుకు అండగా నిలిచి గెలవడంలో కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత వైసిపికి దూరమై 2024 ఎన్నికల ముందు పవన్‌కళ్యాణ్ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ క్రమంలో ఆయనకు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ పదవి దక్కడంపై అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కనకరాజు సూరి

30 ఏళ్ల నిరీక్షణకు దక్కిన ఫలితం

పలువురు హర్షం



ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా వేగేశ్న సూర్యనారాయణరాజు (కనకరాజు సూరి) నియమితులయ్యారు. కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులు రెండోవిడత కేటాయింపుల్లో భాగంగా ప్రస్తుతం జనసేనలో ముఖ్యనేతగా ఉన్న కనకరాజు సూరికి అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కనకరాజ సూరి గత 30 ఏళ్ల నుండి రాజకీయాల్లో ఉన్నారు. జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు కొంతకాలం నిర్వర్తించారు. జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యులుగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కనకరాజు సూరి తాత వేగేశ్న కనకరాజు కలిగొట్ల జమిందారుగా పేరుగాంచారు. కనకరాజు 1965లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా, రెండు సార్లు టిడిపి తరపున అత్తిలి ఎంఎల్‌ఎగా, టిటిడి బోర్డు ఛైర్మన్‌గా పని చేశారు. దంతులూరి నారాయణరాజు కళాశాల (డిఎన్ఆర్) వ్యవస్థాపకుల్లో ఒకరిగా, ఆంధ్రా సుగర్స్ వ్యవస్థాపకులో ఒకరిగా, సిరీస్ కంపెనీ (హైదరాబాద్) వ్యవస్థాపకుల్లో ఒకరిగా, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉపాధ్యక్షులుగా సేవలందించారు. ఉన్నత విలువలు, భావాల కోసం వందలాది ఎకరాలు, కోట్లాది రూపాయలు ధారబోసిన గొప్ప మానవతావాది కనకరాజు. తాత ఆశయాలను ఆదర్శాలను పుణికిపుచ్చుకున్న కనకరాజు సూరి ఉండి కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్ అధ్యక్షునిగా పని చేశారు. అత్యంత ప్రతిష్టాత్మమైన భీమవరం డిఎన్ఆర్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా క్రియాశీలంగా పనిచేశారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ తరపున భీమవరం ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పొందారు. 2018లో పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు తిరిగి జనసేనలో చేరారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి గోదావరి జిల్లాలో జనసేన, తెలుగుదేశం, బిజెపి అభ్యర్థులను, నాయకులను సమన్వయపరిచి కూటమి విజయానికి శక్తి మేర కృషి చేశారు. ఈ నేపథ్యంలో క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా కనకరాజు సూరిని నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు .

వ్యవసాయానికి ఉపాధి హామీ అనుసంధానం

పెద్దసంఖ్యలో సీసీ, బిటి రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణం

900 మినీ గోకులాలకు రూ.16.63 కోట్లు మంజూరు

ఉపాధి కూలీలకు సుమారు రూ.83 కోట్లు చెల్లింపు

పనుల కల్పనలో రాష్ట్రంలో జిల్లాకు నాలుగో స్థానం

ముఖాముఖిలో డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు



ప్రజాశక్తి - భీమవరం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేశారని, రైతులు, పాడి రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు సూచించారు. ఉపాధి హామీ జాబ్‌కార్డులు, పని దినాల కల్పన, పనుల లక్ష్యం, వేతనాలు, సీసీ రోడ్లు, బిటి రోడ్లు, డబ్ల్యూబిఎం రోడ్లు, సీసీ డ్రెయిన్లు, మినీ గోకులాలు, గడ్డి పెంపకం, పల్లె వనాల ఏర్పాటు వంటి విషయాలపై ప్రజాశక్తి ముఖాముఖిలో అప్పారావు వివరించారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి. రోజుకి సరాసరి ఎంతమంది పని చేస్తున్నారు?

పీడీ: జిల్లాలో లక్షా 79 వేల కుటుంబాలు ఉన్నాయి. దీనిలో 2.94 లక్షల మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. దీనిలో రోజుకి సరాసరి లక్షా 36 వేల మంది ఉపాధి పనులు చేస్తున్నారు.

ప్రశ్న: ఈ ఏడాది ఎన్ని పని దినాలను, ఎన్ని కోట్లు విలువైన పనులను లక్ష్యంగా తీసుకున్నారు. ఎన్ని పనులు కల్పించారు. వేతనాలు ఎంత?

పీడీ: జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 42 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా తీసుకున్నాం. ఇప్పటి వరకు 30.82 లక్షల పని దినాలు కల్పించాం. సుమారు రూ.126 కోట్ల విలువైన పనులకు ఇప్పటి వరకూ రూ.83 కోట్లు వేతనాల రూపంలో చెల్లించాం.

ప్రశ్న: రోజుకి వేతనం ఎంత చెల్లిస్తున్నారు?

పీడీ: జిల్లావ్యాప్తంగా రోజువారీగా లక్షా 36 వేల మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. వీరందరికీ రోజుకి సగటున రూ.263 అందిస్తున్నాం. వేతనాలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నాం.

ప్రశ్న: ఉపాధి పనుల కల్పనలో జిల్లా ఎన్నో స్థానంలో ఉంది?

పీడీ: గతంతో పోలిస్తే ఈ ఏడాది పని దినాలు ఎక్కువగా కల్పించాం. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తీసుకున్న లక్ష్యానికి మించి పని దినాలు కల్పించి వేతనాలు కూడా సకాలంలో చెల్లించాం. గతంలో జిల్లా ఎనిమిదో స్థానంలో ఉండగా ప్రస్తుతం నాలుగో స్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టర్, ఎంపిడిఒలు, ఎపీడీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, వేతనదారుల అందరి సహకారంతో జిల్లాను నాలుగో స్థానంలో నిలిపాం.


ప్రశ్న: వ్యవసాయ రంగాన్ని ఏ విధంగా ప్రోత్సహిస్తున్నారు?

పీడీ: పంట కాలువల పూడికతీత, పంటబోదెలు బాగుచేత వంటివి రైతులకు అవసరమైన పనులు చేయిస్తున్నాం. కొబ్బరి, మామిడి, జామ చెట్ల చుట్టూ గుంటలు ఏర్పాటు చేసే పనులు కూడా ఈ పథకంలో పెట్టడం జరిగింది. ఆసక్తి గల రైతులు జాబ్‌కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పుస్తకం ఫీల్డ్ అసిస్టెంట్‌కు అందిస్తే పథకానికి అనుసంధానం చేస్తారు. అలాగే హార్టికల్చర్, పండ్ల మొక్కలు పెంచుకుంటే నీళ్లు పోసే ఏర్పాటు కూడా ఈ పథకంలో ఉంది.

ప్రశ్న: పాడి రైతులకు ఎనర్జీస్ పథకం ఏ విధంగా ఉపయోగపడుతుంది?

పీడీ: పాడి రైతులకు ఎనర్జీస్ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. ఈ పథకంలో పశువులకు గడ్డి పెంచేందుకు వీలుంది. రైతులు ఎవరైనా 10 సెంట్లు భూమిలో గడ్డి పెంచుకునే నిమిత్తం రూ.10 వేలు ఇస్తాం. 10 సెంట్ల భూమి నుంచి 50 సెంట్లు వరకు ఎంత భూమిలోనైనా ఈ గడ్డి పెంపకం చేసుకోవచ్చు. పశుసంవర్థక శాఖ ద్వారా దరఖాస్తులు కోరుతున్నాం. ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రశ్న: ఈ పథకంలో పండ్ల చెట్లు పెంచుకునేందుకు వీలుందా?



పీడీ: ప్రతి గ్రామంలో పల్లె వనాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రభుత్వ భూమిగానీ, లేదా కమ్యూనిటీకి సంబంధించిన భూమిగానీ 25 సెంట్లు నుంచి ఎకరం వరకు చూపించి పంచాయతీ తీర్మానం చేసి ఇస్తే ఆ భూములో పల్లె వనాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ పల్లె వనాల్లో ముఖ్యంగా మామిడి, బత్తాయి, నిమ్మ, జామ, సపోటా, సీతాఫలం, కోకోనట్, నేరేడు, చింత, ఉసిరి చెట్లు పెంచుకుని, ఆ పండ్లను వారే తీసుకోవచ్చు. అలాగే టేకు, మహాగని, ఎర్ర చందనం మొక్కలు కూడా పెంచొచ్చు.

ప్రశ్న: ప్రభుత్వ భవనాలకు మెటీరియల్ రూపంలో ఎంత ఖర్చు చేశారు?

పీడీ: గ్రామ సచివాలయ భవనాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఆర్‌బికెల నిర్మాణంతోపాటు ప్రభుత్వానికి సంబంధించిన మరికొన్ని పనులకు సుమారు రూ.54 కోట్లు మెటీరియల్ రూపంలో వెచ్చించారు.

ప్రశ్న: ఈ ఏడాది ఎన్ని పనులు చేశారు. ఎన్ని కిలోమీటర్ల మేర రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు, ఎంత నిధులు ఖర్చు చేశారు?

పీడీ: 346 పనులకు రూ.45 కోట్ల 65 లక్షలు ఖర్చు చేసి 63.37 కిలోమీటర్లు సీసీ రోడ్లు నిర్మించాం. ఎనిమిది పనులకు రూ.3 కోట్ల 41 లక్షలు ఖర్చు చేసి బిటి రోడ్లు నిర్మించాం. మరో రెండు పనులకు రూ.35 లక్షల ఖర్చు చేసి 1.50 కిలోమీటర్లు డబ్ల్యూబిఎం రోడ్లు వేశాం. మరో 65 పనులకు రూ.6.63 కోట్లు ఖర్చు చేసి సీసీ డ్రెయిన్లు నిర్మించాం.

ప్రశ్న: జిల్లాకు మినీ గోకులాలు ఎన్ని మంజూరయ్యాయి. ఎన్ని పూర్తయ్యాయి. ఎన్ని కోట్లు మంజూరయ్యాయి?

పీడీ: జిల్లాకు 900 మినీ గోకులాలు మంజూరయ్యాయి. వీటికి రూ.16.18 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే 11 మినీ గోకులాల నిర్మాణం పూర్తయింది. మరో 10 మినీ గోకులాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

ప్రశ్న: మినీ గోకులాలు ఎప్పటిలోగా పూర్తి చేసి ఎప్పుడు ప్రారంభిస్తారు?

పీడీ: పంచాయతీరాజ్ శాఖా మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభించాలని అనుకుంటున్నాం. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆధ్వర్యంలో ప్రారంభించేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం.

ప్రశ్న: సమాచార బోర్డులు ఏమైనా ఏర్పాటు చేశారా?

పీడీ: జిల్లావ్యాప్తంగా 408 పంచాయతీల పరిధిలో అన్నిచోట్లా సిటిజన్ ఇన్ఫర్మేషన్ బోర్డులు ఏర్పాటు చేశాం. ఆ గ్రామానికి సంబంధించి ఎనర్జీస్ పథకంలో ఏ పనులు జరిగాయి, ఎంత ఖర్చు చేశారు, ఎంతమంది పని చేశారు వంటి వివరాలు ఆ బోర్డుల్లో పొందుపరిచాం. గ్రామానికి చెందిన ఎవరైనా ఈ వివరాలు తెలుసుకునేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేశాం.

ప్రశ్న: ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారుల పనితీరుపై అనేక ఆరోపణలు, విమర్శలు వస్తున్నాయి. దీనిపై మీరు ఏ విధంగా చర్యలు తీసుకుంటున్నారు?

పీడీ: ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులు ఏమైనా అవకతవకలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదు. ఎంతటి వారిపైనైనా శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడను. ఎవరి మీదైనా ఆరోపణలు వస్తే ఎపీడీచే విచారణ జరిపించి చర్యలు తీసుకుంటాం. నెలా 15 రోజుల్లో ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాం.

ప్రశ్న: జిల్లా అభివృద్ధికి మీరు తీసుకునే చర్యలేమిటీ?

పీడీ: జిల్లా నూతనంగా ఏర్పడిన తర్వాత గతంతో పోలిస్తే ఎనర్జీస్ పథకం జిల్లాలో సమర్థవంతంగా అమలవుతోంది. కలెక్టర్ ఆదేశాలతో పథకాన్ని అన్ని తరగతులకు చేరువ చేస్తున్నాం. కొత్త పనులు గుర్తించటమే కాకుండా గుర్తించిన పనులు వేగంగా పూర్తి చేస్తున్నాం. జిల్లాలో పని దినాలు పెంచే విధంగా ప్రణాళిక రూపొందించి ఆ విధంగా ముందుకు సాగుతున్నాం. జిల్లా సమగ్రాభివృద్ధికి నా వంతు కృషి చేస్తున్నాను.

ధరలను అదుపు చేయకపోవడం సిగ్గుచేటు

ప్రజాపోరులో సిపిఎం నాయకులు



భీమవరం : మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

ఎన్నికల సమయంలో ధరలను అదుపు చేస్తామని చెప్పిన చంద్రబాబు వాటిని నియంత్రించకపోవడం సిగ్గుచేటు అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. ఈనేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, ప్రజా సమస్యలపై సిపిఎం ప్రజాపోరు నిర్వహిస్తుందన్నారు. ప్రజాపోరు రెండవ రోజు 38వ వార్డు లంకపేట నుంచి శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ధరలు అదుపు చేయకుండా కేంద్ర ప్రభుత్వం బ్లాక్ మార్కెట్ దళారులకు కొమ్ముకాస్తుందని విమర్శించారు. జమిలి ఎన్నికల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. ఈనెల 15న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి.వాసుదేవరావు, డి.త్రిమూర్తులు, డి.నాగేశ్వరరావు, కె.కుమారి, సాయమ్మ, సాల్మన్ రాజు, కె.కోదండం పాల్గొన్నారు.

వీరవాసరం : నిత్యావసర సరుకుల అక్రమ నిల్వలను గుర్తించి, వాటిని ప్రజలకు పంచాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం రాష్ట్ర పిలుపులో భాగంగా శనివారం వీరవాసరంలో ప్రజాపోరు నిర్వహించారు. కరపత్రాలను ఇంటింటికీ పంచారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పోతుల మృత్యుంజయ, కేతా జ్యోతిబసు, పాలా కోటేశ్వరరావు, అయినపూడి బాబూరావు, లింగం సత్యనారాయణ, బొర్రా అలమహరాజు, గొట్టుముక్కల శ్యాంబాబు, రెడ్డి రామారావు, కిలాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

తణుకు : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుక విధానం అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం రాష్ట్ర వ్యాప్త ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కప్పల వెంకన్న సెంటర్, నరేంద్ర సెంటర్, గణేష్ చౌక్ వద్ద గ్రూప్ సమావేశాలు నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, అంజి, శ్రీనివాసరావు, గంగా, నాగరాజు, చంటి, సత్యనారాయణ, జనార్థన్, శ్రీను పాల్గొన్నారు.

పెనుగొండ : ప్రజాసమస్యల పరిష్కారానికై ప్రజాపోరు నిర్వహిస్తున్నామని శనివారం పెనుగొండ గాంధీ బొమ్మ సెంటర్లో సిపిఎం నాయకులు ప్రజాపోరు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా, గ్రామ కార్యదర్శి నాగిశెట్టి గంగారావు, నీలాపు ఆదినారాయణ, మాదాసు నాగేశ్వరరావు, శీలం ఏసు, రాజమహేంద్రవరపు వెంకటేష్, గుర్రాల సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకోడేరు : కూటమి ప్రభుత్వం కుప్పిగంతులు వేసుకుంటూ ఎన్నికల సమయంలో ఉచితంగా ఇసుకను అందిస్తామని చెప్పినా అమలు కాకపోవడం సరికాదు కదా డబ్బులు ఇస్తున్నా దొరకని పరిస్థితి ఏర్పడిందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ విమర్శించారు. ప్రజా పోరు యాత్రను శృంగవృక్షంలో శనివారం గోపాలన్ ప్రారంభించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శేషాపు ఆశ్రయ, పోటికలుపూడి శ్రీను పాల్గొన్నారు.

ఆచంట : నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ప్రజాపోరు వాల్ పోస్టర్లను శనివారం స్థానిక సంత మార్కెట్ సిపిఎం స్థూపం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎన్.శర్మ, తోటపల్లి సత్యనారాయణ, తలుపూరి బుల్లబ్బాయి, బండి రంగారావు, చదలవాడ చంటిబాబు, మన్నే బ్రహ్మయ్య, షేక్ ఖాసిం, నాగరాజు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్‌తోపాటు మిగతా హామీలన్నీ తక్షణం అమలు చేయాలని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాపోరు ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాఖా కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు, యండమూరి నాగేంద్ర, దున్నే రుద్రనాగేశ్వరరావు, విశ్వనాథం సుబ్బారావు, కుడక వీరభద్ర రావు, తాళ్ల సత్యనారాయణ, బొక్క మోహన్‌రావు, అందే కోట బసవయ్య, రుద్రాక్షల శ్రీనివాసు పాల్గొన్నారు.

ఉండి: మండలంలోని చెరుకువాడ గ్రామంలో శనివారం సాయంత్రం ప్రజాపోరు యాత్రకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, నాయకులు చీరల శేషు, నిమ్మితి కిషోర్, చీర్ల శ్రీనివాస్, గండికోట ఏసు, పేకేటి సత్యవతి, కాశాని దానమ్మ, కాశాన శ్రీనివాస్, పడమటి తాయారు, పడమటి నాగేశ్వరరావు, రుద్రరాజు విజయరామరాజు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక అందుబాటులో ఉంచేందుకు చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి




ప్రజాశక్తి - భీమవరం

ఉచిత ఇసుకను వినియోగదారులకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆమె ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, రవాణా అధికారులతో సమావేశమై ఉచిత ఇసుకపై సమీక్షించారు. ఇసుక కారణంగా ఇబ్బంది పడుతున్నామనేది జిల్లాలో ఎక్కడ విన్పించకూడదని, దీనికి అవసరమైన పటిష్ట చర్యలను ఇప్పటికే జిల్లా యంత్రాంగం చేపట్టిందని తెలిపారు. మండల అధికారులు మరింత శ్రద్ధ పెట్టి జిల్లా యంత్రాంగం సూచించిన విధానాన్ని కచ్చితంగా అమలయ్యేలా పూర్తిస్థాయి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

సాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

అధికారులకు మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశం



రైతులతో మాట్లాడుతున్న మంత్రి రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పోడూరు, యలమంచిలి, పాలకొల్లు మండలాల్లోని కొన్ని ప్రాంతాలతోపాటు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో నీటిఎద్దడి ఉన్నట్టు రైతులు ఫిర్యాదు చేస్తున్నారని, రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా సాగునీరు అందించాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం మంత్రి తన క్యాంపు కార్యాలయం వద్ద పోడూరు మండలం పెనుమదానికి చెందిన కొందరు రైతులు తమకు ప్రస్తుతం నీటిఎద్దడి ఉందని, ఇలాగైతే వచ్చే రబీలో నీటి సమస్య మరింత పెరిగే అవకాశం ఉందని ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రి ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారితో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరారు.

పకడ్బందీగా ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియ

ఓటర్ల సంక్షిప్త సవరణ రోల్ అబ్జర్వర్ నాయక్

భీమవరం : జిల్లాలో కొత్తగా ఓటర్ల నమోదు, సవరణల పక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఓటర్ల సంక్షిప్త సవరణ 2025 రోల్ అబ్జర్వర్, పశుసంవర్ధక, డైరీ డెవలప్మెంట్ శాఖల సెక్రటరీ ఎంఎం.నాయక్ ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో నాయక్ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లాలోని ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలతో సమావేశమై ఓటర్ల జాబితా సవరణపై సమీక్షించారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించే లక్ష్యంతో పగడ్బందీగా ఓటర్ల స్క్రూటీని చేయాలని తెలిపారు. ఇఆర్‌ఒలు బిఎల్‌ఒలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఓటర్ల జాబితా తయారీలో దిశా నిర్దేశం చేయాలన్నారు. ఓటర్ల జాబితా ప్రకటించే నాటికి తప్పులకు తావు లేకుండా ఉండాలన్నారు. ఓటర్ల నమోదుకు పెద్ద ఎత్తున స్వీప్ యాక్టివిటీస్ నిర్వహించాలన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదుకు ప్రత్యేక దృష్టి సారించాలని, దీనిలో భాగంగా కళాశాలలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేకంగా ఫొటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల నమోదుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో 20 మండలాలు ఉండగా గణపవరం మండలం ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ఉందని తెలిపారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలు, ఒక పార్లమెంటరీ నియోజకవర్గం ఉందని, 2024 నాటికి జిల్లా అంచనా జనాభా సుమారు 20,25,599 మంది ఉన్నారని తెలిపారు. వీరిలో పురుషులు 10,12,143 మంది ఉండగా, స్త్రీలు 10,13,456 ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 14,71,189 మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో పురుషులు 7,20,781 మంది, స్త్రీలు 7,50,320 మంది, ఇతరులు 79 మంది నమోదు అయినట్లు తెలిపారు. సర్వీస్ ఓటర్లు 88 మంది ఉన్నారని తెలిపారు. జెండర్ రేషియో 1041, ఎలక్టర్స్ పాపులేషన్ రేషియో 726గా ఉందన్నారు. జిల్లాలోని 929 ప్రాంతాల్లో మొత్తం 1,461 పోలీస్ స్టేషన్లు ఉన్నాయని, ఏడు మంది ఇఆర్‌ఒలు, 44 మంది ఎఇఆర్‌ఒలు ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఇఆర్‌ఒలు, నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు, భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, బిజెపి ప్రతినిధి కోమటి రవికుమార్, సిపిఎం ప్రతినిధి బి.బలరాం, బిఎస్‌పి ప్రతినిధి మురాల రత్నరాజు పాల్గొన్నారు.

షరీఫ్, కొత్తపల్లికి పదవులపై సర్వత్రా హర్షం

ప్రజాశక్తి - నరసాపురం

కూటమిలో ఇద్దరు సీనియర్లకు కీలకమైన నామినేటెడ్ పదవులు ఇవ్వడం హర్షణీయమని టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. శనివారం టిడిపి కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి మాజీ ఎంఎల్‌సి చైర్మన్ షరీఫ్ టిడిపికే కొనసాగుతున్నారు. ఆటుపోట్లు ఎదుర్కొని పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసే షరీఫ్ కీలకమైన ప్రభుత్వ అడ్వైజర్ ఎపి మైనార్టీ ఎఫైర్స్(కేబినెట్) హోదా కలిగిన పదవి, జనసేనకు చెందిన కొత్తపల్లికి కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, వాతాడి ఉమా, అధికారి అనంతరామారావు, సంకు భాస్కర్, పొన్నాల నాగబాబు పాల్గొన్నారు.

మొగల్తూరు : మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడుకు కూటమి ప్రభుత్వం కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేయడం పట్ల శనివారం జనసేన నాయకులు, ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ కర్రి వీరాస్వామి, దొంగ స్వామి, మైలాబత్తుల రాంబాబు, మెండు రాజేష్, గురజ శ్రీను హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

ఉల్లంపర్రు విద్యార్థుల ప్రతిభ

పాలకొల్లు రూరల్ : ఉల్లంపర్రు మాంటిస్సోరి విద్యార్థులు డి.శృతి 10వ తరగతి, ఎ.గణేష్ 9వ తరగతి, కె.హర్షిత్ శర్మ 8వ తరగతి చదువుతూ ప్రతిష్టాత్మకమైన చెకుముకి టాలెంట్ పరీక్షలో జిల్లాలో ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్ మద్దాల వాసు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలోని విద్యార్థులు ఇందులో పోటీపడుతూ ఉంటారన్నారు. మండల స్థాయిలో జరిగిన పోటీలో ప్రతిభ చూపిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. వివిధ పాఠశాలల నుంచి 34 టీంలు పాల్గొనగా అందులో తమ స్కూల్ టీం జిల్లాలో ప్రథమ స్థానం సాధించారని తెలియజేశారు.

యాక్టివిస్టులను తక్షణమే విడుదల చేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు

భీమవరం టౌన్ : వైసిపి సోషల్ మీడియా యాక్టివిస్టులను తక్షణమే విడుదల చేసి వారిపై జరుగుతున్న అరాచకాలను అరికట్టాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద రాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎసిపి కార్యాలయంలో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆ పార్టీ నాయకులతో కలిసి ఎస్‌పి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమంగా అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని కోరారు. నర్సాపురం పార్లమెంట్ కన్వీనర్ గూడూరి ఉమాబాల పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే ఆయుధంగా ముందుకు సాగాలి

తాడేపల్లిగూడెం : జీవితంలో ఎన్ని సమస్యలు ఎదురైనా ఆత్మవిశ్వాసమే ఆయుధంగా ముందుకు సాగాలని విశాఖపట్నానికి చెందిన ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఎన్.రవికాంత్ విద్యార్థులకు సూచించారు. ఏపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఆచార్యులు, డాక్టర్ ఎన్‌వి.రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జివి వీరేష్ కుమార్ పర్యవేక్షణలో రెండు రోజులపాటు నిర్వహించనున్న మీట్ యువర్ కౌన్సిలర్ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సమావేశంలో డాక్టర్ రవికాంత్ మాట్లాడుతూ మానసిక ప్రశాంతత కోసం ప్రతి విద్యార్థి యోగా, వ్యాయామం, పఠనం, నడక నిత్యం కొంత సమయాన్ని కేటాయించాలని చెప్పారు. విద్యార్థుల వ్యక్తిగత, వృత్తిక సంబంధించిన సమస్యలపై అవగాహన కల్పించారు.

వైసిపి బలోపేతానికి కృషి

కాళ్ల : నియోజకవర్గంలో వైసిపి బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పెదఅమిరంలో ఆయన ఆధ్వర్యంలో ఉండి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ గట్టాలని నాయకులకు పిలుపు నిచ్చారు. ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు అధికారులు శనివారం ముసుగులు వేశారు. శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారుల ఆదేశాల మేరకు సచివాలయ, రెవెన్యూ సిబ్బంది విగ్రహాలకు ముసుగులు ఏర్పాటు చేశారు.

నేరాలు - ఘోరాలు

మైనర్ బాలిక పట్ల అసభ్యకర ప్రవర్తన

ప్రజాశక్తి - ఉండి

మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఉండి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండి మండలం వెలివర్రు గ్రామానికి చెందిన దర్శి అబ్రహం అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన ఒక బాలిక పట్ల శుక్రవారం సాయంత్రం అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక తల్లిదండ్రులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్శి అబ్రహాంని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

వ్యక్తి అరెస్టు : 11 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - పెనుగొండ

తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ శనివారం నిర్వహించిన దాడులలో పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామానికి చెందిన గుండాబత్తుల వెంకటేశ్వరరావు(58)ని బెల్ట్ షాపు నిర్వహిస్తున్న కారణంగా అరెస్టు చేసి అతని వద్దనుంచి 11 మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐలు ఆర్.మధుబాబు, బి.లక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠరెడ్డి

ప్రజాశక్తి - తణుకు

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. శనివారం ఎక్సైజ్ శాఖ దాడుల్లో పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామానికి చెందిన గుండాబత్తుల వెంకటేశ్వరరావుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మణికంఠరెడ్డి మాట్లాడుతూ బెల్ట్ షాపు నిర్వహిస్తున్న కారణంగా వెంకటేశ్వరరావుని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు ఆర్.మధుబాబు, బి.లక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

నమ్మించి రూ.50,400 అపహరణ

ప్రజాశక్తి - నరసాపురం

ఫోన్ పేలో రూపాయి కొడితే మీకు ఇవ్వాల్సిన మొత్తం సొమ్మును మా యజమాని కడతానని నమ్మించి ఓ కేటుగాడు రూ.50 వేలు కాజేసిన ఘటన నరసాపురంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం నరసాపురం పట్టణంలోని మొగల్తూరు రోడ్డులో శ్రీరామ్ బిల్డింగ్ మెటీరియల్ దుకాణం ఆచంట గోపాలకృష్ణ నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం సిమెంట్ దుకాణం తెరవగానే ఒక యువకుడు వచ్చాడు. మొదట 20 బస్తాల సిమెంట్ అడిగాడు. బేరం ఆడాడు, తగ్గించి మొత్తం ఎంత అవుతుందో లెక్కగట్టి చెప్పమన్నాడు. వ్యాపారి దీన్ని లెక్కగట్టి చెప్పగా ఓ నెంబర్ చెప్పి మీ ఫోన్ నుంచి రూపాయి కొట్టండి మా యజమాని ఆ నెంబర్‌కు సొమ్ము వేస్తాడని నమ్మించాడు. అదే సమయంలో వ్యాపారి కడుతున్న ఫిన్ నెంబర్‌ను ఆవ్యక్తి గమనించాడు. కేటుగాడు చెప్పిన నెంబర్‌కు రూపాయి వెళ్లేదు. ఈ విషయాన్ని వ్యాపారి చెప్పగానే ఏది నేను చూస్తానని ఫోన్ తీసుకున్నాడు. అదే సమయంలో 28 బస్తాలు ఎంత అవుతుందో లెక్కగట్టమన్నాడు. దుకాణదారుడు తన సహాయకుడికి ఆ పని చెబుతున్నాడు. ఈ సమయంలో ఆ కేటుగాడు వ్యాపారి ఫోన్ నుంచి ఫోన్ పే ద్వారా స్కానర్ ఓపెన్ చేసి ఖాతాలో ఉన్న రూ.50,400ను కొట్టేశాడు. అనంతరం మళ్లీ ఏమీ తెలియనట్లుగా దుకాణదారునికి ఫోన్ ఇచ్చేసి తాను డబ్బులు పట్టుకొస్తానని నమ్మించి అక్కడ నుంచి జారుకున్నాడు. అయితే అతను వెళ్లాక ఫోన్ పే చెక్ చేసుకుంటే ఖాతాలో సొమ్ము లేదు. వెంటనే బయటకు వచ్చి చూస్తే కేటుగాడు కనిపించలేదు. పరిసర ప్రాంత ప్రజలకు విషయం చెప్పడంతో వారంతా వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీనిపై బాధితుడు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి ఫిర్యాదు చేసినట్లు గోపాలకృష్ణ చెప్పారు.

ప్రీ-రిపబ్లిక్ సెలక్షన్స్‌లో ఎస్‌కెఎస్‌డి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - తణుకు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరంలో ప్రీ-రిపబ్లిక్ సెలక్షన్స్ సెప్టెంబరు 24న జరిగాయని, ఈ సెలక్షన్‌లో తమ విద్యార్థిని జి.స్వాతిక సెలక్ట్ అయిందని కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయ్ తెలియజేశారు. ఈ సందర్భంగా సుందరీబాయ్ మాట్లాడుతూ మహారాష్ట్ర, బెల్గాంలో జరుగు క్యాంప్‌లో ఈ విద్యార్థిని పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ కెవి.శ్యామలాదేవి, సిహెచ్.రమేష్‌బాబు పాల్గొన్నారు.



పతకాలు సాధించిన మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీల్లో మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తణుకు

ఈనెల 6, 7, 8వ తేదీల్లో గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన 36వ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ లెవెల్ రోలర్ స్కేటింగ్ హాకీ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తణుకు మాంటిస్సోరి విద్యార్థులు పాల్గొని రజత పతకాలు సాధించారని స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలియజేశారు. 20 మందిలో(కేడెట్) 7-11 విభాగంలో ఏడుగురు రెండవ స్థానములోనూ, (సబ్ జూనియర్స్) 11-14 విభాగంలో 9 మంది రెండవ స్థానములో నిలిచి రజత పతకాలను సాధించారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందులో ఎంపిక కాబోయే విద్యార్థులు డిసెంబరు 4వ తేదీన కోయంబత్తూర్‌లో జరుగబోవు నేషనల్ లెవెల్ రోలర్ స్కేటింగ్ హాకీ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు. తమ స్కూల్‌లో చదువుతో పాటు క్రీడలకు కూడా ఉత్తమమైన శిక్షణ అందిస్తున్నామని, విద్యార్థులు తమ తమ వ్యక్తిగత ప్రతిభలను గుర్తించే విధంగా ప్రోత్సహిస్తున్నామన్నారు. పతకాలను సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను, శిక్షణ ఇచ్చిన కోచ్ ఎ.భార్గవ్‌ను అభినందించారు.

మధుమేహంపై అవగాహన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మధుమేహ నిర్ధారణ శిబిరం నిర్వహణ స్ఫూర్తిదాయకమని ప్రముఖ సీనియర్ న్యాయవాది, లయన్స్ మాకా శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బి గ్రౌండ్స్‌లో ఉచిత మధుమేహ నిర్ధారణా పరీక్షలు, షుగర్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లయన్స్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులు, లయన్స్ ఇంటర్నేషనల్ సభ్యులు ప్రజలకు అనేక అవగాహనా కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరంలు ఏర్పాటు చేస్తున్నాయని, ప్రజలు వాటిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా షుగర్ వ్యాధిపై అవగాహనా కరపత్రాలు ఆవిష్కరించి అందించారు. అనంతరం ఉచితంగా బ్లడ్ షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ చెన్నారెడ్డి సతీష్, నార్ని చిన్ని, యర్రా ఆంజనేయ స్వామి, వాకర్స్ మానేపల్లి కిరణ్, దంగేటి ముఖర్జీ, బెజవాడ రాంబాబు, అపర్ణ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కరాటే పోటీలకు15 మంది ఎంపిక

నరసాపురం: మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జెఎన్‌టియుకె ఇంటర్ కళాశాలల కరాటే ఎంపిక పోటీలు జరిగాయి. ఉభయగోదావరి జిల్లాలోని 11 ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొన్నారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మంచి నైపుణ్యం కనబరిచిన 15 మంది క్రీడాకారుల్ని ఎంపిక చేశారు. వచ్చేనెల 3 నుంచి 7 వరకు భూపాల్‌లో జరిగే సౌత్ వెస్ట్ జోన్ తరుపున జెఎన్‌టియు నుంచి ఈ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కెఎస్‌విఎన్.మూర్తి, యూనివర్సిటీ న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ ప్రవీణ్, పి.సుభాన్లు వ్యవహరించారు. అనంతరం కళాశాల చైర్మన్ కెవి.సత్యనారాయణ, కోశాధికారి కొండేటి త్రినాథ్, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ సురేష్‌కుమార్‌లు విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.

వైసిపి హయాంలో కుంటుపడిన అభివృద్ధి

మంత్రి రామానాయుడు

పాలకొల్లు : గత వైసిపి ప్రభుత్వ పాలనలో అమరావతి రాజధాని, పోలవరం వంటి ప్రాజెక్టులు విధ్వంసానికి గురికావడంతో పాటు 20 ఏళ్ళ వెనక్కి వెళ్లాయని, అటువంటి విధ్వంసం పాలకొల్లులోనూ కనిపిస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన శనివారం పాలకొల్లులో పార్టీ శ్రేణులు, అధికారులతో కలిసి మోటార్ సైకిల్‌పై వెళ్ళి గత టిడిపి ప్రభుత్వంలో చేపట్టి 70 శాతం పూర్తి చేసిన ఎన్‌టిఆర్ బొండాడ వెంకటరాజు గుప్త మున్సిపల్ కళాక్షేత్రం, చంద్రబాబు నాయుడు ఉద్యానవనం, అబ్దుల్ కలాం హెల్త్ పార్క్, గౌడ శెట్టిబలిజ కళ్యాణ మండపం, షాదీ ఖానా, హిందూ స్మశాన వాటిక తదితర అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సమస్యలు ఆలకించిన మంత్రి రామానాయుడు

పాలకొల్లు కార్యాలయంలో మంత్రి రామానాయుడును పెద్ద సంఖ్యలో జనం వచ్చి కలిసారు. ప్రతి ఒక్కరూ గ్రామ, వార్డు సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రతి ఒక్కరినీ మంత్రి రామానాయుడు ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను ఆలకించి, పరిష్కార దిశగా చర్యలు తీసుకున్నారు. మరి కొన్నింటికి సంబంధిత శాఖ అధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఆరోగ్య సమస్యలపై వచ్చిన వారికి నేనున్నానంటూ భరోసా ఇస్తూ అవసరమైన విధంగా ఆదేశాలు ఇచ్చారు.

గర్భిణులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించాలి

జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎం.మహేశ్వరరావు

ప్రజాశక్తి - ఉండి

గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎం.మహేశ్వర రావు అన్నారు. శనివారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభయ కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులతో మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యం పట్ల డాక్టర్లు, గ్రామస్థాయిలో ఎఎన్ఎంలు, ఆశాలు చూపించే శ్రద్ధ గురించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డాక్టర్లు ఇచ్చే సలహాలను, సూచనలను తప్పకుండా పాటిస్తూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టే శిశువు ఆరోగ్యంగా పుడుతుందని తెలిపారు. ఆస్పత్రులలో సాధారణ కాన్పులకే ఎక్కువ శాతం అవకాశం ఇవ్వాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో సుమారు 307 మంది గర్భిణులు ఉన్నారని అన్నారు. ప్రసవించే స్త్రీ, జన్మించే శిశువు పట్ల వైద్యులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకుని ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లే వరకు జాగ్రత్తగా చూడాల్సిన బాధ్యత ఆసుపత్రి సిబ్బందిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి.సాయిచంద్ర, ఆరోగ్య విస్తరణాధికారి సిహెచ్.కృష్ణ కుమార్, ఎఎన్ఎంలు, గర్భిణులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

టౌన్ రైల్వే స్టేషన్ మేనేజర్ శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్లాస్టిక్ నిషేధంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలని భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాస్ అన్నారు. శనివారం ప్లాస్టిక్ నిషేధంపై భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రయాణికులతో సదస్సు, పేపర్ బ్యాగ్స్ పంపిణీ కార్యక్రమాన్ని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. అనారోగ్యానికి హేతువు ప్లాస్టిక్ అని తెలిసి కూడా విపరీతంగా ప్లాస్టిక్‌ను వాడటం నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని, రైల్వే ప్రయాణికులు ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా నిషేధించాలని అన్నారు. ప్రయాణికులు ఎం.సత్యవతి(నరసాపురం), కె.శ్రీరామ్మూర్తి(భీమవరం), ఎన్.రాంబాబు(భీమవరం), సునీల దేవి(పాలకొల్లు) మాట్లాడుతూ ఈవిధమైన ప్రచారం చేయడం ఒక మంచి పరిణామమని, రైల్వే స్టేషన్, రైలులో కూడా చెత్త చేయడం దారుణమని, ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తామని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, టికెట్ కలెక్టర్ ఎం.పుష్ప, వీర పట్నాయక్, ఉండపల్లి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

నకిలీ డాక్టర్ గుట్టురట్టు..!

ప్రయివేట్ మెడికల్ షాప్, క్లినిక్ మూసివేత

ప్రజాశక్తి - పెనుగొండ

డాక్టర్‌గా చెలామణి అవుతూ అర్హత కలిగిన సర్టిఫికెట్లు లేకపోవడంతో స్థానిక ప్రయివేట్ మెడికల్ షాప్, క్లినిక్‌ను అధికారుల ఆదేశాల మేరకు శనివారం పెనుగొండ పిహెచ్‌సి వైద్యులు, మెడికల్ ఆఫీసర్ వినోద్ కుమార్ నిలిపివేశారు. వివరాల ప్రకారం మండలంలో సోమరాజు చెరువు గ్రామంలో నకిలీ డాక్టర్ ఎంబిబిఎస్‌లా చెలామణి అవుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. చుట్టుపక్కల గ్రామస్తులు, వృద్ధులు, కీళ్ల నొప్పులతో బాధపడేవారిని టార్గెట్‌గా చేసుకుని కీళ్ల నొప్పులు నయంచేస్తానంటూ మోకాళ్లకు స్టెరాయిడ్ ఇంజక్షన్స్ ఇస్తున్నారు. మెడికల్‌స్టోర్‌తో పాటు డాక్టర్ అవతారం ఎత్తి గుట్టుచప్పుడు కాకుండా ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. విషయం కాస్త జిల్లా వైద్యాధికారులకు తెలియడంతో డిఎంహెచ్‌ఒ ఆదేశంతో హుటాహుటిన వచ్చి మెడికల్ ఆఫీసర్ పరిశీలించగా వీరి వద్ద డాక్టర్ అని చెప్పుకుంటున్నటువంటి సర్టిఫికెట్స్ లేవు. మెడికల్ స్టోర్లో పెద్ద మొత్తంలో పెయిన్ కిల్లర్స్, స్టెరాయిడ్స్ గుర్తించారు. దీంతో మెడికల్ స్టోర్‌ను, క్లీనిక్‌ను నిలిపివేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు.

ఆక్వా ట్రేడర్స్‌కు బెదిరింపు ఫేక్ కాల్స్!

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గత నాలుగు రోజులుగా భీమవరంలో జరుగుతున్న ఐటి దాడులు అందరికీ తెలిసిన విషయమే. దీంతో వ్యాపారులు హడలెత్తిపోతున్నారు. దీనికి తోడు కొందరు అగంతకులు ఆక్వా వ్యాపారస్తులకు ఫేక్ కాల్స్ చేస్తూ తాను ఆదాయపు శాఖ నుంచి మాట్లాడుతున్నానని, మీ ఫైలు నా వద్ద ఉందని, నాకు రూ.10 వేలు ఫోన్ పే చేస్తే రాంగ్ ఫిర్యాదుగా ఫైల్ క్లోజ్ చేస్తానని, లేకపోతే మీ ఫైలు అధికారులకు అప్పజెప్పడం జరుగుతుందని, మీరు లక్షలు చెల్లించుకోవలసి వస్తుందని ప్రజలకు కాల్స్ రావడంతో వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు. శనివారం భీమవరం సర్కిల్ వార్డు 1 ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కుమార్ పేరుతో బెదిరింపులు కాల్స్ కలకలం రేపాయి. రూ.10 వేలు వేయకపోతే ఐటి అధికారులు రైడ్స్‌కు వస్తారని భీమవరంలోని చాలా కంపెనీలకు ఫోన్లో బెదిరింపు కాల్స్ వస్తున్నాయని వ్యాపారస్తులు వాపోతున్నారు. ఫేక్ వాయిస్ కాల్ వాట్సాప్‌లో ప్రస్తుతానికి హల్‌చల్ చేస్తుంది.

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని కొండ్రుపోలు గ్రామంలో ఈనెల 6వ తేదీన జరిగిన అగ్ని ప్రమాద ప్రదేశాన్ని శనివారం వైసిపి రాష్ట్ర రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డీ రఘురాం నాయుడు పరిశీలించారు. ప్రమాదంలో సర్వం కోల్పోయిన జలపర్తి రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణసాయంగా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇంటి నిర్మాణానికి కావలసిన సిమెంట్, ఐరన్ రేకులు అందిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వడ్డీ రఘురామ్ మాట్లాడుతూ కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్న సామాన్య కుటుంబంలో ఇలాంటి ప్రమాదం జరగడం బాధాకరమని అన్నారు. విద్యుత్ అధికారులు పేద ప్రజలు నివసించే ప్రదేశాల్లో పరిశీలించి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. రాజకీయాలకతీతంగా అగ్ని బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. తాటాకులతో ఇంటిని నిర్మిస్తే మళ్లీ ఇలాంటి అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, రేకులతో ఇంటిని నిర్మించేందుకు రేకులు అందిస్తానని అన్నారు. వైసిపి తరఫున అండగా ఉంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ముత్యాల ఆంజనేయులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరాలయం యాత్రికులతో కిటకిట



కాళ్ల : ఆలయంలో పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు వెంకటేశ్వర స్వామి పుణ్యక్షేత్రానికి యాత్రికులు పోటెత్తారు. కార్తీకమాస శనివారం కావడంతో తెల్లవారుజాము నుంచి స్వామివారి దేవాలయం యాత్రికులతో కిటకిటలాడింది. రెండవ శనివారం సెలవు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి యాత్రికులు పూజల్లో పాల్గొన్నారు. శనివారం శ్రవణా నక్షత్రం సందర్భంగా సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ ఇఒ మోకా అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఈనెల 13న బుధవారం పద్మావతి సరోవరం వద్ద స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం జరుగుతుందన్నారు. ఈనెల 15న కార్తీక పూర్ణిమ శ్రీస్వామివారికి పంచామృత అభిషేకం, ఈనెల 16న శనివారం దేవాలయ ప్రాంగణంలో(కృత్తిక) కార్తీకదీపోత్సవం జరుగుతుందన్నారు. ఈనెల 23న శనివారం సహస్ర దీపాలంకరణ సేవ, ఈనెల 25న కార్తీక సోమవారం యాత్రికులతో ఉచిత సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతములు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 29న శుక్రవారం స్వామివారికి పంచామృత అభిషేకం, ఈనెల 30న శనివారం స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ జరుగుతుందన్నారు.

భీమవరం టౌన్: ప్రతిఒక్కరూ సాంప్రదాయాలను కొనసాగిస్తూ ముందుకు సాగాలని స్థానిక ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. స్థానిక జువ్వలపాలెం రోడ్డులో ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలలో శనివారం ఎంఎల్‌ఎ అంజిబాబు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు, ఆలయ ఇఒ ముదునూరి సత్యనారాయణ రాజు పర్యవేక్షణలో శ్రీమాన్ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాద చార్యుల ఆధ్వర్యంలో స్వామివార్లకు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో ఎంఎల్‌ఎ అంజిబాబును సత్కరించారు. ఆలయ ఇఒ సత్యనారాయణ రాజు మాట్లాడుతూ మూడురోజులుగా శ్రీవారి పవిత్రోత్సవాలు జరుగుతున్నాయని, పూర్ణాహుతితో స్వామివారి పవిత్రోత్సవాల కార్యక్రమాలు ముగిశాయన్నారు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఈనెల 13న క్షీరాబ్ధి ద్వాదశి ధాత్రి తులసి అర్చన, 30న లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం డిఎస్‌పి జయసూర్య, సీనియర్ టిడిపి నాయకులు మెంటే పార్థసారధి, కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి, మంతెన కనకదుర్గ ప్రసాద రాజు, నడింపల్లి వెంకట రామరాజు పాల్గొన్నారు.



ఎంఎల్‌ఎ అంజిబాబుని సత్కరిస్తున్న ఆలయ చైర్మన్

ఇసుక కొరతను పరిష్కరిస్తాం : ఆర్‌డిఒ

నరసాపురం: జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఉందని ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, దాన్ని నాలుగు రోజుల్లో పూర్తిగా పరిష్కరిస్తామని ఆర్‌డిఒ దాసిరాజు అన్నారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా సరిహద్దునున్న తూర్పు గోదావరి జిల్లాలో ఔరంగబాద్, తీప్పర్రు, పెండ్యాల, వందలపర్రు ర్యాంపుల్ని తెరిచామన్నారు. ఇందులో తీప్పర్రు ర్యాంపు నుంచి జిల్లాకు ఇసుక సరఫరా అవుతుందన్నారు. నీరు తగ్గముఖం అయిన తర్వాత రోజుకు 150 లారీల ఇసుక జిల్లాకు వస్తుందన్నారు. ర్యాంపుల్లో లోడింగ్‌తో కలిపి 20 టన్నుల ఇసుక రూ.4,500 అవుతుందన్నారు. ఈ లెక్కన శివారునున్న నరసాపురం, మొగల్తూరు ప్రాంతాలకు లారీ ఇసుకకు ట్రాన్స్‌పోర్టు ఛార్జీలతో కలిసి రూ.10 వేలు మించదన్నారు. ఆన్‌లైన్ బుకింగ్ సమస్యల్ని అధిగమించేందుకు గృహ నిర్మాణదారులు నేరుగా ర్యాంపు వద్దకు వెళ్లి ఇసుకను తెచ్చుకోవచ్చున్నారు. దీనికి పంచాయతీ కార్యదర్శి, విఆర్‌ఒతో ఇళ్ల కడుతున్నట్లు ధృవీకరణ పత్రం తీసుకుని ర్యాంపుల్లో చూపించాలన్నారు. జిల్లాలో ఎక్కడ ఇసుక స్టాక్ పాయింట్లకు లేవన్నారు. ఇసుక కావలసినవారు స్థానిక తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా నాగలక్ష్మి

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని ప దో వార్డు మున్సిపల్ ప్రైమరీ హై స్కూల్ ఎస్‌జిటి ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వివి ఎస్ఎస్.నాగలక్ష్మి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికయ్యారు. 1996లో పిఠాపురంలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా సర్వీసులో చేరిన ఆమె 2002లో నరసాపురం పురపాలక సంఘానికి బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి పురపాలకంలో పలు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జిటి ఉపాధ్యాయులుగా పనిచేశారు. వీటితోపాటు ఇంగ్లీష్ టీచింగ్‌పై దేశంలో వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లాట్ ఫారాల 11 రీసెర్చ్ పేపర్లను కూడా సమర్పించారు. ఉత్తమ బోధనతో విద్యార్థులు తీర్చిదిద్దటంలో ఆమె కృషి, పట్టుదలను గుర్తించే ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించడం పట్ల యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు, మున్సిపల్ కన్వీనర్ ఎం.లక్ష్మీనారాయణ, ఎన్‌వి.సత్యనారాయణ, ఎస్.అజయ్ కుమార్, ఎం.మాణిక్యాలరావు, చంద్రకుమార్, సిహెచ్.కృష్ణ పాల్గొన్నారు.

గరగపర్రు వివాదంలో 16 మంది అరెస్టు

పాలకోడేరు : రెండు వర్గాల మధ్య ఏర్పడిన వివాదంలో 16 మందిని అరెస్టు చేసినట్లు పాలకోడేరు ఎస్ఐ ఎం.రవివర్మ తెలిపారు. వీరిని కోర్టుకు హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈనెల 5వ తేదీ రాత్రి గరగపర్రులో గౌరమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు రాళ్ళు రువ్వుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు దారి తీసాయి.అదే సమయంలో బందోబస్తులో ఉన్న పోలీసులపై కూడా రాళ్ళు విసరడంతో ఒక కానిస్టేబుల్‌కు తీవ్ర గాయం అయింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి వివాదంలో ఉన్న 16 మందిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రైస్తవ సువార్త సభలకు అనుమతి రద్దు తగదు

తణుకు : ప్రజా క్షేమం కోసం శాంతియుతంగా నిర్వహిస్తున్న క్రైస్తవ సువార్త సభలను అర్ధాంతరంగా రద్దు చేయటం అధికారులకు, ప్రభుత్వానికి తగదని తణుకు ఏరియా పాస్టర్ల అసోసియేషన్ సభ్యులు ఆందోళనలకు దిగారు. వివరాల్లోకెళితే ఈనెల 9, 10, 11 తేదీల్లో తణుకు జిల్లా పరిషత్ ఉన్నత(బాలురు) హైస్కూల్ ఆవరణలో బహిరంగ సువార్త సభలకు సంబంధిత అధికారుల నుంచి నిర్వాహకులు ముందుగానే అనుమతి పొందారు. ఈ నేపథ్యంలో ప్రచారం జోరుగానే సాగించారు. తమిళనాడుకు చెందిన బోధకుని ఆహ్వానించి, అందుకు లక్షల్లో ఖర్చుచేశారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం అధికారులు పిలిచి అదే గ్రౌండ్‌లో కోటి దీపార్చన కార్యక్రమం వెంటనే నిర్వహిస్తున్నందున మూడు రోజుల మీటింగ్స్‌ను రెండు రోజులకు తగ్గించమని తెలపగా అందుకు అసోసియేషన్ సభ్యులు అంగీకరించారు. తిరిగి పోస్టర్లు, బ్యానర్లు ద్వారా ప్రచారం సాగించారు. అయితే శనివారం సాయంత్రం సభ ప్రారంభం ముందు మళ్లీ అధికారులు నిర్వాహకులను పిలిచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన కారణంగా ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో ఎటువంటి కార్యక్రమాలకు అనుమతులు లేవని, మీటింగ్స్‌ని రద్దు చేసుకోవాల్సిందిగా తెలిపి హై స్కూల్ గేటుకు తాళాలు వేశారు. నోటీసులు తీసుకోవాల్సిందిగా నిర్వాహకులను కోరారు. అయితే అందుకు నిరాకరించిన సభ్యులు హైస్కూల్ ప్రాంగణం బయట శాంతియుతంగా ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. క్రైస్తవులు అంటే చిన్న చూపు తగదన్నారు. లక్షలు ఖర్చుపెట్టి ప్రజల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న సభలను అర్ధాంతరంగా రద్దు చేయటం అత్యంత అవమానకరమని వాపోయారు. పట్టణంలో శాంతి ర్యాలీ జరపాలని నిశ్చయించారు. తణుకు పట్టణ రూరల్ సిఐలు సిబ్బందితో అక్కడే ఉన్నారు. పాస్టర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు ఒ.మనోజ్ బాబు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం కోమర్రు గ్రామ కాపురస్తులైన విప్పర్తి వెంకటలక్ష్మి భర్త సతీష్ అను నేను నా యొక్క పాస్ పోర్టు గణపవరం SBI సెంటర్లో జిరాక్స్ తీయించుకొని మా ఇంటికి వచ్చే మార్గమధ్యలో పాస్ పోర్టు నెంబరు X0579498 గల పాస్ పోర్టు మరియు జిరాక్స్‌తో సహ కవర్లో పెట్టుకుని మా ఇంటికి వచ్చే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు. ఎంత వెతికిన దొరక లేదు దొరికినవారు ఈ కింది ఫోన్ నెంబర్‌కు తెలియజేయవలసినదిగలరు.

విప్పర్తి వెంకటలక్ష్మి, భర్త సతీష్ కోమర్రు
గ్రామం గణపవరం మండలం,
పశ్చిమగోదావరి జిల్లా. సెల్ 9032811886